# స్వగతంబు

## వరద

ద్వీపకల్ప దేశాన్ని మూత్రసిద్ధి మహారాజుగారు పాలిస్తూండేవారు. ఆయన సమస్త జీవరాసులకి ఎటువంటి హాని కల్గించకుండా జీవించడానికి ప్రయత్నిస్తూ పరస్త్రీలకేసే కాకుండా స్వంత స్త్రీలకేసి కూడా కన్నెత్తి చూడకుండా కాలక్షేపం చేస్తూ ప్రజల్లో మంచివాడుగా పేరు సంపాదించుకున్నాడు.

రాజుగారు ఎవరికీ హాని చెయ్యలేని మంచివాడని ప్రజలకి తెలిసిపోవడంవల్ల దేశంలో అరాచకం క్రమంగా ప్రబల సాగింది. దేశంలో నిత్యావసరవస్తువుల ధరలు మండిపోసాగాయి. అన్ని ధరలూ అలా మండిపోడంవల్ల వేసవిలో వేడి ఎక్కువైపోయి, నీరంతా ఎండి మేఘాలుగా మారి ఉత్తరదిశగా వెళ్ళిపోసాగాయి. నీరంతా ఇంకిపోయినా, మేఘాలన్నీ వలసపోయినా ధరలు మాత్రం అలాగే మండిపోసాగాయి. కొన్నాళ్ళకి మేఘాలన్నీ ఉత్తర దిశలో వున్న పర్వత పంక్తులు అడ్డుతగలడంవల్ల వర్షించి, వానలై, ఏరులై, సెలయేరులై, నదులై ప్రవహించి, పొంగి, ఉప్పొంగి వరదలై విజృంభించ సాగాయి.

ఉత్తరాన పడిన భారీ వర్షాలవల్ల దక్షిణం దాకా వరదల ఉధృతం ఉప్పెనలా వచ్చింది. దేశమంతా జలమయం అయిపోయింది.

పర్యవసానంగా ఇళ్ళ కప్పులు, చెట్ల చివరలు తప్ప మరేమీ కన్పించనంత నీరు దేశాన్ని ముంచెత్తింది. కొట్టుకుపోగా మిగిలిన ప్రజలు ఆ ఇండ్ల కప్పులమీద, చెట్ల చివరలమీద ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వరద తగ్గు ముఖం పట్టాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకోసాగారు.

కోట బురుజు మీదనుండి దేశ ప్రజల కష్ట సుఖాలు తిలకిస్తూన్న శ్రీ మూత్రసిద్ధి మహారాజుగార్ని "మహారాజా చూశారా! పదిమంది పిల్లలున్న ఆ తల్లికి వరదలో ఐదుగురు పిల్లలు కొట్టుకుపోయినా మరో ఐదుగురు మిగిలారు. అందుకనే నేను కుటుంబనియంత్రణ వద్దని మొదట్నించీ మొత్తుకుంటున్నాను. ఓపిక వున్నంత




మంది పిల్లల్ని కనడం తప్పుకాదని ఇప్పటికైనా తమరు ఒప్పుకుంటారా!" అని అడిగాడు రాజ వైద్యుడు.

"అయితే! నువ్వింత వరకూ ఎందుకు పెళ్ళిచేసుకోలేదు" అనడిగారు రాజుగారు సూటిగా రాజవైద్యుడి కళ్ళల్లోకి చూస్తూ.

"అసలు పెళ్ళిచేసుకోడం మా ఇంట్లో ఆనవాయితీ లేదండి. మానాన్నకూడా పెళ్ళి చేసుకోలేదు" అని నిజం ఒప్పుకున్నాడు. బ్రహ్మచారి అయిన రాజవైద్యుడు.

"సరేగాని, ముందు పడవలో ఎక్కు! అలా వెళ్ళి ప్రజల్ని పరామర్శించి వచ్చి సంతాప ప్రకటన ఇద్దాం" అని రాజుగారు రాజ వైద్యుడ్ని కూడా ఆహ్వానించారు.

"నేను కూడా తమతో వచ్చి వరదల మీద ప్రభుత్వ కవిత్వం చెప్పి చందాలు వసూలుచేసి ప్రపంచ వరద మహా సభలు జరిపిస్తాను మహారాజా!" అని మంత్రి మండలితరఫున సహాయ మంత్రి సరదా పడ్డారు.

"సరే"నని అతడ్ని కూడా ఎక్కించుకుని రాజుగారు వరద బాధిత ప్రాంతాల్ని సందర్శించడానికి పత్రికా విలేఖరుల్ని, ఫొటోగ్రాఫర్లని మర్చిపోకుండా వెంటబెట్టుకుని బయల్దేరారు.

ఎక్కడికి వెళ్ళినా ఆకలి, అనారోగ్యం అన్ని ఇళ్ళకప్పులమీద, చెట్లచివరలపైన తాండవమాడుతోంది.

చందాలకోసం కవిత్వం చెప్పబోయిన సహాయమంత్రిని ప్రజలు నీళ్ళల్లో ముంచి చంపేశారు.

"మించిపోయిందిలేదు. మరింత మంది పిల్లల్ని మళ్ళీకనండి" అని ఓదార్చబోయిన రాజవైద్యుడ్ని ప్రజలు నానా శాపనార్థాలు పెట్టడంవల్ల అతడు మతి చెలించి, కోతిగా మారి చెట్లెక్కి పారిపోయాడు.

ఎన్ని రాజకీయ సంక్షోభాలు వచ్చినా, ఎన్ని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా చెక్కు చెదరని మూత్రసిద్ధి మహారాజుగారు "ప్రజలారా! ఇది మనకు పరీక్ష సమయం. మీరు భయపడకండి. మీ ఆకలి తీర్చడానికి తిండి లేదని, మీ అనారోగ్యం పోగొట్టే ఔషధాలు లేవని విచారించకండి. ఈ వరద నీళ్ళన్నీ వీలైనన్ని కసితీరా తాగెయ్యండి. ఎంత ఎక్కువ నీరు తాగితే అంత మూత్రం వస్తుంది. సదరు మూత్రాన్ని ఒక్క చుక్క కూడా వృధా పోనియ్యకుండా మళ్ళీ తాగెయ్యండి. మూత్రంలో మీ ఆకలి తీర్చే ఆహారపు విలువలున్నాయి. మీ అనారోగ్యంపోగొట్టే ఔషధా లున్నాయి. ఇలా మీరు అకుంఠిత దీక్షతో సహకరిస్తే ఈ నీళ్ళన్నీ కొద్ది రోజుల్లో తరిగిపోతాయి. వరద తరిగిపోతుంది. అంతిమ విజయం మనదే!" అని ప్రజలకు హితవు చెప్పారు.

వేరే గత్యంతరంలేని వెర్రి ప్రజలు అలాగే చేశారు. వరదనీరు తరిగిపోయింది. ప్రజలు మరింత ఆరోగ్య వంతులై వర్ధిల్ల సాగారు

[నీతి:-ఎన్ని వరద లొచ్చినా మనకేమీ భయములేదు.]

— తంబు

## "నిశ్శబ్ద శబ్దాలు"

నిశ్రాత్రి, నిశ్శబ్దం - కలిసి రాజ్యం చేస్తున్నవేళ
ఎక్కడినుంచో ఎవ్వరినీ తాకని ఎవరికీ సోకని శబ్దాలు
నా చెవులకు సోకుతున్నాయ్! నా మనసును తాకుతున్నాయ్!
ఎక్కడినుంచీ! ఎవ్వరూ విన్పించుకోరేం?
వినపడటంలేదా! ఎవరూ పట్టించుకోరేం?
ఎవరికీ విన్పడనివి నా కొక్కడికే వినిపిస్తున్నాయా!
ఎంతో దగ్గరగా, పెద్దగా, భయంకరంగా, భరించలేనంతగా
చెవులు మూసుకున్నాను. సందేహంలేదు నాలోంచే ఆ శబ్దాలు
వెలికిరాని నిశ్శబ్ద శబ్దాలవి.

—తోలేటి రాంబాబు